# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 25 మంగళవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 244

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


హైదరాబాద్ నగరాభివృద్ధిపై

## శ్రద్ధ లేని ప్రభుత్వం

బడ్జెట్ కేటాయింపులు ఘనం..నిధుల విడుదలలో నిర్లక్ష్యం

బడ్జెట్ పద్దులపై చర్చలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద



2లో

# ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించేది లేదు

- ఈ నెల 31లోపు చెల్లిస్తే 25 శాతం రాయితీ
- భూభారతి అమల్లోకి వచ్చాక భూముల మార్కెట్ విలువ పెంపురాష్ట్రవ్యాప్తంగా ఆరువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- ఇంటర్ విద్యార్హతతో వీఆర్ఏ, వీఆర్వోలకు జీపీవోలుగా అవకాశం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ వేగంగా జరుగుతోందని, ఈ నెల 31వ తేదీలోపు రుసుం చెల్లించేవారికి 25 శాతం రాయితీని అమలు చేస్తున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.**

హైదరాబాద్: అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ వేగంగా జరుగుతోందని, ఈ నెల 31వ తేదీలోపు రుసుం చెల్లించేవారికి 25 శాతం రాయితీని అమలు చేస్తున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పుడు కాకుండా.. ఇంటి నిర్మాణం సమయంలో ఎల్ఆర్ఎస్ తీసుకోవాలంటే 100 శాతం చెల్లించాల్సి ఉంటుందనే విషయాన్ని భూయజమానులు గుర్తించాలని సూచించారు. సోమవారం శాసనసభలోని తన ఛాంబర్‌లో పొంగులేటి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. "ఎల్ఆర్ఎస్ పూర్తి చేయకుండా గత ప్రభుత్వం పక్కనపెట్టింది. ప్రజాప్రభుత్వం వచ్చాక వాటిని పూర్తి చేయడానికి సంకల్పించింది. రుసుం తీసుకోబోమని మేం ఎక్కడా చెప్పలేదు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకుంటే భవిష్యత్‌లో భవన నిర్మాణాలు, రిజిస్ట్రేషన్ల సందర్భంగా సమస్యలుండవు. క్రమబద్ధీకరణ చేయించుకునే వారి నుంచి మంచి స్పందన వస్తోంది. పురపాలకశాఖ ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తిచేస్తుంది. రిజిస్ట్రేషన్ల శాఖకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ లేదా జిల్లా కలెక్టర్ల నుంచి ఎల్ఆర్ఎస్ సర్టిఫికెట్ పొందొచ్చు.





## కెసిఆర్‌పై అసత్య ఆరోపణలు

### బండి సంజయ్‌పై పోలీసులకు బిఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణమాజీ సీఎం కేసీఆర్ దొంగ నోట్లు ముద్రించి ఎన్నికల్లో పంచాడంటూ కేంద్రం మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ మండిపడింది. ఈ మూరకు బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్‌తో పాటు పలువురు నేతలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, కిషోర్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్‌ను ఉద్దేశించి బీదర్‌లో దొంగ నోట్లు ప్రింటింగ్ చేసే మిషన్ ఉందంటూ చేసిన ఆరోపణలు ప్రజల మధ్య వైషమ్యాలు పెంచేలా ఉన్నాయన్నారు. బండి సంజయ్

వ్యాఖ్యలపై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరారు. తాను కేంద్రమంత్రి అనే విషయం మర్చిపోయి ఎలాంటి అవగాహన లేకుండా ఇష్టం

వచ్చినట్లు మాట్లాడుతున్న బండి సంజయ్ తీరు సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు డా. కుర్వ విజయ్ కుమార్, అశ్విన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



2లో

## అసెంబ్లీకి జగదీశ్‌రెడ్డి

- స్పీకర్‌కు లేఖను అందజేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- తన సస్పెన్షన్‌పై బులెటిన్ ఇవ్వాలని స్పీకర్‌కు వినతిపత్రం
- కోర్టుకు పోతాననే భయంతోనే బులెటిన్ ఇవ్వడం లేదన్న ఎమ్మెల్యే

కోర్టు కు వెళతాననే భయంతోనే నా సస్పెన్షన్‌కు సంబంధించిన బులెటిన్ విడుదల చేయడం లేదు. సభ్యులు వేసే ప్రశ్నలకు జవాబులు చెప్పలేక ఏకంగా ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా మంత్రులు గంట ప్రయాణానికి కూడా హెలికాప్టర్లను వాడుతున్నారు.



2లో

## ఆర్ఎస్ఎస్ నీడలో దేశీయ విద్య

జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో రాహుల్

## హైడ్రాపేరుతో దందాలు చేస్తే కఠిన చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక



2లో



2లో

## కోర్టుకెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

మూల్యాంకనంలో నాణ్యత లేదని పిటిషన్

పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు హైకోర్టు నోటీసులు



## మంత్రివర్గ విస్తరణకు పచ్చజెండా

హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. ప్రస్తుత విస్తరణలో నలుగురికి అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. వీటితోపాటు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులను సైతం భర్తీ చేయనున్నారు. సోమవారం సాయంత్రం దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సైతం ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, మంత్రివర్గ విస్తరణలో ఎవరెవరికి అవకాశం కల్పించాలన్న విషయాలతోపాటు ఏప్రిల్ 24 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'భారత్ సంవిధాన్ అంతర్జాతీయ సదస్సు'పైనా సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. భారత సంవిధాన్ సమావేశాలకు సుమారు 80 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నారు. అయితే, ప్రస్తుత భేటీలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపైనే ఎక్కువగా చర్చించినట్లు సమాచారం. ఆరుగురికి చోటు కల్పించడానికి అవకాశం ఉండగా, ప్రస్తుతం నాలుగు స్థానాలను భర్తీ చేసి... రెండు ఖాళీలను మరోసారి భర్తీ చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

# అనుమతుల పేరుతో అక్రమ రవాణా....

"నిజామాబాద్ జిల్లాలో అబివృద్ది పనులు, ఇళ్ల నిర్మాణాల పేరిట యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుంది. అధికార పార్టీ నేతలు, విడిసి ల కనుసన్నల్లో ప్రభుత్వ నిభందనలు గాలికి వదిలి యధేచ్చగా ఇసుక దోపిడీ చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు ఆర్మూర్ ప్రాంతంలోని ఎర్గట్ల మండలం, భట్టపూర్ పెద్ద వాగు లో పెద్ద ఎత్తున ఇసుక తరలింపే నిదర్శనంగా పేర్కొనవచ్చు. మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనీల్ సొంత నియోజకవర్గంలోనే ఇసుక దోపిడీ కొనసాగడంపై విమర్శలు వస్తున్నాయి".



2లో

## ఆర్ఎస్ఎస్ నీడలో దేశీయ విద్య

న్యూఢిల్లీ:: భారతీయ విద్యావ్యవస్థను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ నాశనం చేస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఎన్ఇపి 2020, యుజిసి ముసాయిదా నిబంధనలు, పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఎన్ఎస్‌యుఐ సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో చేపట్టిన నిరసనలో రాహుల్‌గాంధీ పాల్గన్నారు. విద్యార్థులనుద్దేశించి రాహుల్‌గాంధీ మాట్లాడారు. మన విద్యావ్యవస్థ ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి వెళితే దేశం నాశనమౌతుందని, ఉపాధి అంతరించిపోతుందని అన్నారు. ఆర్ఎస్ఎస్ నామినేట్ చేసిన అభ్యర్థులే ఇప్పుడు దేశమంతటా యూనివర్శిటీ–ల్లో వైస్ ఛాన్సలర్లుగా ఉన్నారని, ప్రస్తుతం రాష్ట్ర యూనివర్శిటీ–ల్లోనూ విసిలను ఆర్ఎస్ఎస్ నామినేట్ చేస్తోందని అన్నారు. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం అతిపెద్ద సమస్యగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల క్రితం ప్రధాని కుంభమేళా గురించి ప్రస్తావించారు, కానీ ఉపాధి గురించి మాత్రం మాట్లాడలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువతను నిరుద్యోగులుగా మార్చిందని మండిపడ్డారు. ఉపాధి గురించి మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని విద్యార్థులకు సూచించారు. దేశంలోని సంపదనంతా అంబానీ, అదానీలకు పంచిపెడుతోందని, అన్ని ప్రభుత్వ సంస్థలను ఆర్ఎస్ఎస్‌కు అప్పగిండచం బిజెపి–ఆర్ఎస్ఎస్ మోడలన లక్ష్యమని అన్నారు. మనమందరం ఐక్యంగా వారిని తిప్పికొట్టాలని అన్నారు.

## కోర్టుకెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

**హైదరాబాద్:** గ్రూప్–1 అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలంటూ హైకోర్టులో అభ్యర్థులు పిటిషన్ వేశారు. మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు తెలిపారు. 18 రకాల సబ్జక్టులుంటే 12 సబ్జక్టుల నిపుణులతోనే దిద్దించారన్నారు. 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదని వెల్లడించారు. ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో రెండు భాషల పేపర్లు దిద్దించచారని.. దీంతో మూల్యాంకణంలో నాణ్యత కొరవడిందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీకి గాను.. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్–1 పరీక్షలు జరిగాయి. ఈ మెయిన్స్‌కు 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పిటిషనర్లు తెలిపారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు.. టీ–జీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ వేయాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గ్రూప్–1 మెయిన్స్‌పై తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈనెలలోనే గ్రూప్–1 మెయిన్స్ ఫలితాలతో పాటు– గ్రూప్–2, గ్రూప్–3 ఫలితాలను కూడా టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్ 1 మెయిన్స్, గ్రూప్–2 రాత పరీక్షల మార్కులు విడుదలయ్యాయి. అలాగే మార్చి 14న గ్రూప్–3 ఫలితాలను కూడా విడుదల చేసింది. అలాగే గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 783 గ్రూప్–2 పోస్టుల భర్తీకి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు మొత్తం 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక 1,365 గ్రూప్–3 సర్వీస్‌ల పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలు నిర్వహించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్–3 రాత పరీక్షలు జరిగాయి. ఈనెల 14న గ్రూప్–3 ఫలితాలను టీ–జీపీఎస్సీ విడుదల చేసింది.

## శ్రవణ్ రావుకు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ,: ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్ రావుకు ఊరట లభించింది. విదేశాల నుంచి భారత్ వచ్చేందుకు ఆయనను అరెస్ట్ చేయకుండా సుప్రీం కోర్టు మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం నుంచి ఊరట లభించడంతో ఈవారం చివర్లో శ్రవణ్ రావు హైదరాబాద్ రానున్నారు. అయితే పోలీసుల విచారణకు హాజరుకావాలని, విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశించింది. శ్రవణ్ రావు 48 గంటల్లో శ్రవణ్ రావు ఇండియాకు వస్తారని సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు కోర్టుకు తెలిపారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌పై సోమవారం సుప్రీంలో విచారణకు రాగా, శ్రవణ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ క్రమంలో శ్రవణ్‌కు సుప్రీం స్వల్ప ఊరట కల్పిస్తూ.. శ్రవణ్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు ఇచ్చింది. అలాగే పోలీసుల విచారణకు సహకరించాలని శ్రవణ్‌కు సుప్రీం ఆదేశించారు. కచ్చితంగా విచారణకు హాజరుకావాల్సిందే అని స్పష్టం చేసింది. విచారణ నిమిత్తం అమెరికా నుంచి భారత్‌కు వచ్చేందుకు శ్రవణ్‌ను అరెస్ట్ చేయకుండా సుప్రీం మధ్యంతర రక్షణ కల్పించింది.

## హైదరాబాద్ నగరాభివృద్ధిపై శ్రద్ధ లేని ప్రభుత్వం

**బడ్జెట్ కేటాయింపులు ఘనం..నిధుల విడుదలలో నిర్లక్ష్యం**

**బడ్జెట్ పద్దులపై చర్చలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద**

హైదరాబాద్: హైదరాబాద్ మహానగర అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా జరిగినప్పటికీ..నిధులు విడుదల చేయడంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం పద్దులపై జరిగిన చర్చలో హైదరాబాద్ నగరాభివృద్ధిపై, నిధుల విడుదలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేపీ వివేకానంద మాట్లాడుతూ.. గతంలో హైదరాబాద్ నగరానికి ప్రతి సంవత్సరం రూ.10 వేల కోట్లు– కేటాయిస్తామని గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీకి రూ.2654 కోట్లు– కేటాయించి రూ.1200 కోట్లను మాత్రమే విడుదల చేశారని తెలిపారు. హెచ్ఎండీఏకు రూ.2,500 కోట్లు కేటాయించి పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. జలమండలికి రూ.3385 కోట్లు కేటాయిస్తే.. రుణాలకే రూ.800 కోట్లు– ఇచ్చారని, ఇప్పటికే ప్రతిపాదించిన మెట్రో రూట్లను రద్దు చేశారని అన్నారు. మెట్రోకు రూ.1100 కోట్లు– కేటాయిస్తే.. రూ.300 కోట్లు– మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. మూసీ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు– కేటాయిస్తే .. కేవలం రూ.80 కోట్లు మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఫోర్త్ సిటీ–, ఫ్యూచర్ సిటీ– పేరుతో హంగామా చేస్తున్నారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీకి రూ.7582 కోట్లు– అడిగితే..రూ.3100 కోట్లే కేటాయించారని సభలో లేవనెత్తారు. ఈ విధంగా గతేడాది కేటాయించిన నిధుల్లో కేవలం 25 శాతమే విడుదల చేయడంపై నగరాభివృద్ధిపై ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపిస్తుందని విమర్శించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వెంటనే పారిశుద్ధ కార్మికుల వేతనాలు 18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మిక పక్షపాతిగా కేసీఆర్ ఎంతో దాతృత్వంతో నాడు పారిశుద్ధ కార్మికుల జీతాలను 7 వేల నుంచి 12 వేలకు పెంచారని కేపీ వివేకానంద తెలిపారు. 2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 18 వేల రూపాయలు ఇస్తామని కార్మికులకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే పారిశుద్ధ కార్మికుల జీతాలను 18 వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. రోడ్లను యంత్రాల ద్వారా ఊడ్చేందుకు రాంకీ సంస్థకు పనులను అప్పజెప్పినా, అది ఆచరణలో సాధ్యం కాలేదని అన్నారు. ప్రస్తుతం రోడ్లను కార్మికులే ఊడుస్తున్నా బిల్లులు మాత్రం రాంకీకి చెల్లిస్తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు.

## అక్రిడేషన్లు మరో 3నెలలు పొడిగింపు



హైదరాబాద్:తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు సమాచారశృాఖ కమిషనర్ హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 30వ తేదీతో ముగియనున్న అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని జూన్ 30వ తేదీ వరకు పొడిగించారు. అక్రిడేషన్ కార్డుల గడువును పొడిగించడం ఇది నాలుగోసారి. ఇప్పటికే అక్రిడేషన్ల పరిమితి, విధివిధానాలపై ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి ఓ నివేదిక సమర్పించారు.

## స్థానిక సంస్థ ఎమ్మెల్సీ ఉన్నిక షెడ్యూల్ విడుదల



హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ పదవీ కాలం మే 1తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మార్చి 28న నోటిఫికేషన్ విడుదలకానుంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అదే నెల 7న నామినేషన్లను పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహారణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉంటుంది. అదే నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. 25న ఫలితాలు ప్రకటిస్తారు.

## అనుమతుల పేరుతో అక్రమ రవాణా...

"నిజామాబాద్ జిల్లాలో అబివృద్ధి పనులు, ఇళ్ల నిర్మాణాల పేరిట యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుంది. అధికార పార్టీ నేతలు, విడిసి ల కనుసన్నల్లో ప్రభుత్వ నిభంధనలు గాలికి వదిలి యధేచ్ఛగా ఇసుక దోపిడీ చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు ఆర్మూర్ ప్రాంతంలోని ఎర్గట్ల మండలం, భట్టపూర్ పెద్ద వాగు లో పెద్ద ఎత్తున ఇసుక తరలింపే నిదర్శనంగా పేర్కొనవచ్చు. మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈర వత్రి అనీల్ సొంత నియోజకవర్గంలోనే ఇసుక దోపిడీ కొనసాగడంపై విమర్శలు వస్తున్నాయి".



- **హస్తం నేతల ఇసుక దందా, అధికారుల అండదండలు.**
- **రీచ్ ల వైపు కన్నెత్తి చూడని మైన్స్.**
- **ఫిర్యాదులు వస్తే నే కదులుతున్న టాస్క్ ఫోర్స్.**
- **ఏర్గట్ల మండలం, భట్టాపూర్ పెద్ద వాగులో జోరుగా ఇసుక తవ్వకాలు**
- **ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ" 50 వేలు వసూలు చేసిన విడిసి.**
- **అబివృద్ధి పనులు, ఇళ్ల నిర్మాణాల పేరిట వే బిల్లులు.**
- **ఓపెన్ మార్కెట్ కు తరలింపు**
- **మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈర వత్రి అనీల్ సొంత నియోజకవర్గంలోనే ఇసుక దోపిడీ.**

**వేగుచుక్క న్యూస్, ప్రతినిధి, కుంచె వెంకటేష్ :**

కమ్మర్ పల్లి, ఎర్గట్ల మండలాల్లోని అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలకోసం మైన్స్ అధికారులు బట్టాపూర్ పెద్ద వాగు లో నెల రోజుల పాటు రీచ్ కు అనుమతి ఇచ్చారు. వే బిల్లుల ద్వారా లబ్ధిదారులకు మాత్రమే ఇసుక అందించాలని నిభందనలు పెట్టారు. కానీ స్థానిక విడిసి అండతో కొంత మంది అక్రమ ఇసుక రవాణకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. లబ్ధిదారులకు అవసరం కంటే ఎక్కువ గా ఇసుక తవ్వకాలు జరిపి, బహిరంగ మార్కెట్ కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పెద్ద వాగు నుండి ఇసుక తరలింపుకు రోజుకు 34 ట్రాక్టర్లకు, 3 ట్రిప్పుల చొప్పున వే బిల్లులు ఇస్తున్నట్టు అధికారులు చెపుతున్నారు. కానీ ఒక్కో ట్రాక్టర్ రోజుకు 10 ట్రిప్పుల వరకు ఇసుక తరలిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. అదనపు ఇసుకను బహిరంగ మార్కెట్ లో రూ" 3500 నుండి రూ" 4000 వరకు విక్రయిస్తున్నట్టు చెపుతున్నారు.

**ఒక్కో ట్రాక్టర్ కు రూ" 50 వేలు విడిసి వసూలు.**

ఇసుక అక్రమ రవాణా కోసం విడిసి ఒక్కో ట్రాక్టర్ కు రూ" 50 వేలు వసూలు చేసినట్టు సమాచారం. 34 ట్రాక్టర్ల కు గానూ రూ" 17 లక్షలు వసూలు చేసినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే అక్రమంగా తరలించి ప్రతి ట్రిప్ కు 8 వందలు వసూలు చేసి తమకు వత్తాసు పలికే వారికి ముడుపులు ముట్టచెపుతున్నారు.

**ప్రభుత్వం, లబ్ధిదారులకు నష్టం.**

నెల రోజుల పాటు కనీస నిబంధనలు పాటించకుండా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే భూగర్భ జలాలు, పర్యావరణం దెబ్బతినే ప్రమాదం ఉంది. అలాగే ప్రభుత్వం, లబ్ధిదారులకు ఎలాంటి లాభం లేకుండా, అక్రమ ఇసుక వ్యాపారులు లక్షలాది రూపాయలు కొల్లగొట్టే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, మైన్స్ అధికారులు స్పందించి నిజమైన లబ్ధిదారులకు ఇసుక అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





## అసెంబ్లీకి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనకుండా తనపై విధించిన సస్పెన్షన్‌కు సంబంధించిన అధికారిక బులెటిన్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి సోమవారం స్పీకర్ చాంబర్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను జగదీశ్‌రెడ్డి కలిశారు. తనను అన్యాయంగా, ఏకపక్షంగా సభ నుంచి సస్పెండ్ చేశారని, ఇప్పటికైనా తన సస్పెన్షన్‌పై బులెటిన్ విడుదల చేయడంతోపాటు అసెంబ్లీ వెబ్‌సైట్‌లో పెట్టాలని స్పీకర్‌కు అందజేసిన లేఖలో జగదీశ్‌రెడ్డి కోరారు.కాగా అసెంబ్లీ లాబీలోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష చాంబర్‌కు వచ్చిన జగదీశ్‌రెడ్డిని సభ ఆవరణ నుంచి బయటకు వెళ్లాలని చీఫ్ మార్షల్ కరుణాకర్ కోరారు. తనను సస్పెన్షన్ చేసినట్టు బులెటిన్ చూపిస్తే బయటకు వెళతానని జగదీశ్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. తాను అసెంబ్లీకి రావడంపై ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొన్నారు. సాయంత్రం మూడు గంటలకు బీఆర్ఎస్ శాసనసభాపక్షం కార్యాలయంలోనే జగదీశ్‌రెడ్డి గడిపారు. అసెంబ్లీ ఇష్టారాజ్యంగా నడుస్తోంది: రాజ్యాంగ విలువ లు, నిబంధనలు లేకుండా అసెంబ్లీ ఇష్టారాజ్యంగా నడుస్తోందని జగదీశ్‌రెడ్డి అ న్నారు. అసెంబ్లీ లాబీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నన్ను అసెంబ్లీ సమావేశాల నుంచి ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటికీ కారణాలు, ఆ ధారాలు చూపడం లేదు. మందబలంతో సభ నడుపుతామంటే కుదరదు.కోర్టు కు వెళతాననే భయంతోనే నా సస్పెన్షన్‌కు సంబంధించిన బులెటిన్ విడుదల చేయడం లేదు. సభ్యులు వేసే ప్రశ్నలకు జవాబులు చెప్పలేక ఏకంగా ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా మంత్రులు గంట ప్రయాణానికి కూడా హెలికాప్టర్లను వాడుతున్నారు. జాన్‌పాడ్‌లో జరిగిన దావత్‌కు కూడా మాజీమంత్రి జానారెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు'అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం..అయోమయం: బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా తయారైందని..అసలు ఏం జరుగుతుందో ముఖ్యమంత్రికే స్పష్టత లేక అయోమయంలో ఉన్నట్టు కనిపిస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శాసనసభలో పద్దులపై చర్చలో భాగంగా సోమవారం రాత్రి ఆయన మాట్లాడారు. అసలు రాష్ట్రం మొత్తం అప్పులెన్ని.. వాటిపై చెల్లిస్తున్న వడ్డీ ఎంత.. కొత్తగా తెస్తున్న అప్పు ఎంత ? లాంటి వివరాలేవీ తెలపటం లేదని విమర్శించారు.

వేగుచుక్క

# బెట్టింగ్ యాప్ ఓనర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**
**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్**




: బెట్టింగ్ యాప్ ఓనర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతు, ఈ మధ్యకాలంలో తెలంగాణలో బెట్టింగ్ యాప్స్ మాఫియా విస్తృతంగా పెరిగాయనీ అన్నారు. అనేకమంది మధ్యతరగతి యువత ఈజీ మనీకి అలవాటుపడి ఈ బెట్టింగ్ ఊబిలో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఈ యాప్స్ వలన పెద్ద మొత్తంలో డబ్బు కోల్పోయి ఆర్థికంగా, మానసికంగా క్రుంగిపోయి ఆత్మహత్యలు చేసుకున్నారని, దాని కారణంగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాపోయారు. ఈ మధ్య ఒక మీడియా పత్రికలో ఒక మాజీ మంత్రి ప్రమేయంతో ఈ యాప్స్ నిర్వాహణ జరిగిందని వస్తున్నా కథనాలపై విచారణ జరపాలన్నారు. ప్రభుత్వం కేవలం కొందరు ప్రమోటర్లకు నోటీసులు పంపి కేసులు బుక్ చేసి చేతులు దులుపుకోవడానికే పరిమితం కాకుండా అసలైన దోషులను గుర్తించి ముఖ్యంగా యాప్ ఓనర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. దోషులను వదిలేస్తే వేల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని గతంలో డ్రగ్స్ కేసు నిరుకార్చినట్టు కాకుండా ఈ బెట్టింగ్ మాఫియా పై పూర్తి స్థాయి విచారణ జరపాలని దోషులు ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకొవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఓటీఎస్ (వన్ టైం సెటిల్మెంట్) ద్వారా ఆస్తిపన్ను బకాయిలపై 90% వడ్డీ మాఫీ కల్పిస్తూ, ప్రిన్సిపాల్ ం 10 శాతం వడ్డీ చెల్లిస్తే పూర్తిగా పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించి ఈ పథకం ద్వారా జి ఎచ్ఎంసి రూ"300–రూ" 500 కోట్లు ఆదాయం సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందనీ అన్నారు. కానీ తెలంగాణలోని 13 మునిసిపల్ కార్పొరేషన్లకు కూడా ఏలాంటి వెసులుబాటు కల్పించలేదని, నిజామాబాదు వంటి కార్పొరేషన్లకు కూడా ఆస్థిపన్ను వడ్డీ మాఫీ వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేసారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు పాటుపడదాం.




**అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్.**
**క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ.**
**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 24**

: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా టీ బీ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి చేపట్టిన ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. నర్సింగ్ విద్యార్థినులు, వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. టీ. బీ అంతం మనందరి పంతం.. క్షయ వ్యాధి నిర్మూలనకు పాటుపడదాం అని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. క్షయ వ్యాధి నిర్మూలనకు చేపడుతున్న చర్యల గురించి, వ్యాధి లక్షణాలు, పాటించాల్సిన జాగ్రత్తలు, చికిత్సా విధానం గురించి టీ బీ నియంత్రణ విభాగం అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం, జిల్లా టీ బీ నియంత్రణ విభాగం కో ఆర్డినేటర్ రవిగౌడ్, నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థినులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నారాయణ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి.

## - ఎబివిపి నాయకుల డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 24:**




ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ స్కూలుపై కఠిన చర్యలు తీసుకోవాలని విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నారాయణ స్కూలు యజమాన్యం పాఠశాలలను నడుపుతుండడంతో వెంటనే ఏబీవీపీ కార్యకర్తలతో కలిసి పాఠశాలలను మూసి వేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అందరూ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ వేసవికాలంలో ఒంటిపూట బడులు ఉన్నప్పటికీ ఒక నిజాం రాజు పరిపాలన లాగా నారాయణ పాఠశాలలో కొనసాగుతుందన్నారు. విద్యార్థులని ఇబ్బందులకు గురి చేస్తూ అనారోగ్యం పాలు చేస్తూ ఆరోగ్య సమస్యలను తీసుకొస్తున్నటువంటి నారాయణ స్కూల్ పైన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే మాకు పర్మిషన్ ఉందని డీఈఓ పర్మిషన్ ఇచ్చారని సమాధానం ఇస్తున్నారని తెలిపారు. కాబట్టి జిల్లా విద్యా శాఖ అధికారి వెంటనే నారాయణ స్కూల్ నీ సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ సునీల్, కంటేశ్వర్ జోనల్ ఇంచార్జ్ దుర్గా దాస్, అభినవ్, తేజ, సుశాంత్, ఇంద్రసేన, వేణు, రంజిత్, రాకేష్, నవీన్, దినేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అందుకే ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌లో 90% మంది నష్టపోతున్నారు: సెబీ చీఫ్



తక్కువ సమయంలో లాభాలను పొందొచ్చనే ఆలోచనే ఫ్యూచర్ అండ్ ఆప్షన్ల విభాగంలో ట్రేడింగ్ చేస్తున్న రిటైల్ మదుపర్లపై చాలా కాలంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇదే విషయంపై సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే స్పందించారు. అతివిశ్వాసమే సంపద కోల్పోయేందుకు కారణమవుతోందన్నారు.

బిజినెస్ టుడే మైండ్‌రష్ 2025 ఫోరమ్‌లో పాల్గొన్న పాండే.. ఎఫ్అండ్ఓ ట్రేడింగ్ గురించి ఆందోళన వ్యక్తం చేశారు. సెబీ అధ్యయనాల ప్రకారం.. ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ విభాగంలో 90 శాతం మంది రిటైల్ పెట్టుబడిదారులు డబ్బును కోల్పోతున్నారన్నారు. తమ ట్రేడింగ్ సామర్థ్యాలను తరచూ అతిగా అంచనా వేసుకొనే మదుపర్లే ఇలా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా గడువు ముగిసే కొన్ని నిమిషాల ముందు మార్కెట్లోకి ప్రవేశించడం వల్ల అస్థిరత ఏర్పడే అవకాశం ఉందన్నారు.


ఎఫ్అండ్ఓపై సెబీ ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసిందని పాండే తెలిపారు. పరిశ్రమ వర్గాల అభిప్రాయం ఆధారంగా వీటి పరిష్కారాలపై పనిచేస్తోందని పేర్కొన్నారు. డెరివేటీవ్స్ ట్రేడింగ్‌తో పాటు, రిటైల్ పెట్టుబడిదారులకు సంబంధించి సెబీ అమలు చేస్తున్న వివిధ చర్యల గురించి మాట్లాడారు. స్టాక్ మార్కెట్ స్థిరత్వం, ఆందోళనలను కూడా పాండే ప్రస్తావించారు. రిటైల్ మదుపర్ల భద్రతకు సంబంధించి ప్రపంచంలోనే ఉత్తమ పద్ధతులను తాము అందిస్తున్నట్లు తెలిపారు.

**మార్చి 31 కౌంట్‌డౌన్ షురూ..**

# పన్ను ఆదా చర్యలు చేపట్టారా మరి..?

ఈ నెలాఖరుతో 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇందుకు మరికొన్ని రోజులే మిగిలి ఉంది. మార్చి 31 డెడ్‌లైన్ ఈ ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్ను ఆదా చేసేందుకు చివరి అవకాశం కూడా. ఇందుకు మీ ముందున్న ఐదు మార్గాలు..

పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడులు: అధికాదాయం కలిగిన వారు పన్ను రాయితీ ప్రయోజనాలందించే ఆర్థిక పథకాల్లో పెట్టుబడులు పెట్టడం మేలు. ఎందుకంటే, ఆదాయం పన్ను చట్టంలో సెక్షన్ 80సీ కింద రూ. 1.5 లక్షల వరకు పన్ను మినహాయింపులను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందుకు ఈక్విటీ అనుసంధానిత పొదుపు పథకాలు (ఈఎల్ ఎసఎస్), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస) తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్‌పీఎస పెట్టుబడులపైన 80సీసీడీ(1బీ) కింద అదనంగా రూ. 50,000 మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వీలుంటుంది.




# గ్రోక్ 3లో ఎడిట్ ఇమేజ్ ఫీచర్..

## చిటికెలో నచ్చినట్టుగా ఫొటో

స్పేస్‌ఎక్స్ అధినేత, బిలియనీర్ ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని సంస్థలు సరికొత్త ఆవిష్కరణలతో యూజర్లను ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తుంటాయి. ఇప్పటికే కృత్రిమ మేధ అంకుర సంస్థ 'ఎక్స్‌ఏఐ.. గ్రోక్ 3 సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ఆయన.. తాజాగా దానిలో కొత్త ఫీచర్‌ని జత చేశారు. అదే 'ఎడిట్ ఇమేజ్'. మీకు కావల్సిన విషయాన్ని టెక్ట్స్ రూపంలో ఇమేజ్‌లో తక్షణమే మార్పులు చేసి అందిస్తుంది.

గ్రోక్ 3 తో ఎడిట్ ఇమేజ్ ఆప్షన్ అందుబాటులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియోను ఎలాన్‌మస్క్ స్వయంగా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. గ్రోక్ 3 అకౌంట్‌ని లాగిన్ అయ్యాక సెర్చ్ బార్ కింద డీప్‌సెర్చ్, థింక్ అని రెండు ఆప్షన్లు కనిపిస్తాయి. దాని పక్కనే కొత్తగా ఎడిట్ ఆప్షన్‌ను జత చేశారు. ఈ Edit Image ఆప్షన్‌ను ఎంచుకొని మీకు ఎలాంటి మార్పులు కావాలో దానికి సంబంధించిన టెక్ట్స్ అందిస్తే చాలు. వెంటనే చిత్రాన్ని మార్చి పంపుతుంది. దీంతో మీకు నచ్చినట్టుగా ఫొటోలను మీరే ఎడిట్ చేసుకోవచ్చన్నమాట. ప్రస్తుతం డెస్క్‌టాప్‌లో గ్రోక్3 వినియోగిస్తున్న వారికి దాదాపుగా ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. త్వరలోనే అందరికీ రోలవుట్ కానుంది.

# క్రేజీ ఆఫర్..రూ.5కే డేటాతోపాటు అన్ లిమిటెడ్ కాలింగ్..




ప్రస్తుతం మన జీవితంలో స్మార్ట్‌ఫోన్‌లు ముఖ్యమైన భాగంగా మారిపోయాయి. ప్రతి రోజు కూడా అనేక విధాలుగా ఉపయోగిస్తూనే ఉంటాం. ప్రధానంగా కాల్స్, ఇంటర్నెట్ బ్రౌజింగ్, సోషల్ మీడియా, షాపింగ్ సహా ఇలా ఎన్నో పనుల కోసం ఉపయోగిస్తున్నాం. ఈ క్రమంలోనే టెలికాం కంపెనీలు ప్రత్యేక రీఛార్జ్ ప్లాన్లను ప్రకటిస్తూ యూజర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ తాజాగా వినియోగదారుల కోసం ఒక అద్భుతమైన ఆఫర్‌ను ప్రకటించింది.

బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చిన ఈ 365 రోజుల ప్లాన్ ప్రస్తుతం రూ. 1999కే అందుబాటులో ఉంది. ఇతర ప్రైవేట్ కంపెనీల ప్లాన్లతో పోలిస్తే, ఈ ప్లాన్ చాలా తక్కువ ధరకు ఉండటం విశేషం. పైగా, ఇది పూర్తి సంవత్సరం పాటు మీ రీఛార్జ్ అవసరాలను తొలగిస్తుంది. మీరు ఈ ప్లాన్‌ను ఎంచుకున్నట్లయితే తప్పకుండా 365 రోజులపాటు అపరిమిత కాలింగ్ సేవలను ఆస్వాదించవచ్చు. మీరు స్థానిక, STD కాల్స్ చేసే సమయంలో ఎటువంటి చార్జీలను చెల్లించాల్సిన అవసరం ఉండదు. అంటే, మీరు మీ కుటుంబ సభ్యులతో, మిత్రులతో లేదా పని సంబంధిత వారితో ఎలాంటి ఆందోళన లేకుండా మాట్లాడుకోవచ్చు.

మీరు పెద్దగా డేటాను ఉపయోగించకపోయినా, SMS సేవలను కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ ప్లాన్ ద్వారా మీరు రోజుకు 100 ఉచిత SMS లను పొందవచ్చు. దీంతో ప్రతిరోజూ మీరు మీ స్నేహితులు, కుటుంబ సభ్యులకు SMSలను ఎప్పుడైనా పంపించుకోవచ్చు. మీరు ఎక్కువ డేటా వినియోగదారులైతే, ఈ 365–రోజుల ప్లాన్ మీకు సరిపోయే ఎంపిక అని చెప్పవచ్చు. ఎందుకంటే దీనిలో మొత్తం 600GB డేటా అందిస్తున్నారు.



# ఎగుమతి సుంకం రద్దు, తగ్గనున్న ఉల్లి ధరలు

దేశంలో మధ్య తరగతి ప్రజలకు గుడ్ న్యూస్. త్వరలో ఉల్లి ధరలు మరింత తగ్గనున్నాయి. ఎందుకంటే ఉల్లి ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 1, 2025 నుంచి ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించారు. కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు శనివారం సాయంత్రం ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని "సున్నా"కి తగ్గించడంతో ధరలు మరింత తగ్గుతాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

# ఐదేళ్లలో రెండో అతిపెద్ద ఆటోమేకర్‌గా భారత్: నితిన్ గడ్కరీ



అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లో అడుగు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. షోరూం కోసం ముంబయి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని ఆ కంపెనీ అద్దెకు తీసుకుంది. మరోవైపు ఉద్యోగ నియామక ప్రక్రియ సైతం చేపడుతోంది. ఈ నేపథ్యంలో టెస్లా రాకతో దేశీయ కార్ల తయారీ కంపెనీలపై ప్రభావం అనే అంశం చర్చకు వస్తోంది. దీనిపై భిన్నాభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఇదే విషయంపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడారు.

బిజినెస్ టుడే మైండ్‌రష్ 2025 ఫోరమ్‌లో పాల్గొన్న గడ్కరీకి.. టెస్లా ఎంట్రీ ఇక్కడి పరిశ్రమపై ఏమేరకు ప్రభావం చూపనుందన్న ప్రశ్న ఎదురైంది. దీనిపై మంత్రి స్పందించారు. భారత ఆటోమొబైల్ పరిశ్రమ సాంకేతికత దిశగా ఎంతో పురోగతి సాధిస్తోందని తెలిపారు. ఎటువంటి అడ్డంకులు లేకుండా సాఫీగా ముందుకు పయనిస్తోందన్నారు. రానున్న సంవత్సరాల్లో ఆటోమోటివ్ పరిశ్రమ ప్రపంచంలో రెండో అతిపెద్దదిగా అవతరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

"2014లో ఆటోమోటివ్ పరిశ్రమ పరిమాణం కేవలం రూ. 14 లక్షల కోట్లుగా ఉండేది. ప్రస్తుతం ఇది రూ. 22లక్షల కోట్లకు చేరింది. ఇక అమెరికా (రూ. 78 లక్షల కోట్లు), చైనా (రూ. 49 లక్షల కోట్లు) తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. త్వరలోనే ప్రపంచానికి ఎలక్ట్రిక్ వాహనాలను ఎగుమతి చేయబోతున్నాం" అని గడ్కరీ అన్నారు. దేశీయ కార్ల తయారీ సంస్థలన్నీ భారత్‌లో మాత్రమే వాహనాల్ని ఉత్పత్తి చేస్తున్నాయని, దీంతో వీటి నాణ్యత మరింత మెరుగుపడుతోందని చెప్పారు.

ఎగుమతుల గురించి మాట్లాడిన గడ్కరీ.. ఈవీలను మాత్రమే కాకుండా త్వరలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, బస్సులను కూడా ఇతర దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న ఐదేళ్లలో కొత్త సాంకేతిక ఆవిష్కరణలు, హైడ్రోజన్ ఆధారిత ఇంధనం.. మొదలైన వాటి సాయంతో ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆటోమేకర్‌గా భారత్ అవతరించనుందన్నారు. ఇక అగ్రస్థానం చేరేందుకు ఎంతో సమయం పట్టదని ధీమా వ్యక్తం చేశారు.



## సుశాంత్ సింగ్ మృతి కేసు.. క్లోజర్ రిపోర్ట్' దాఖలు చేసిన సీబీఐ

బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మూసివేత నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ముంబయి కోర్టులో దాఖలు చేసింది. రియా చక్రవర్తిపై సుశాంత్ తండ్రి చేసిన ఆరోపణలకు సంబంధించి ఒక కేసు, సుశాంత్ కుటుంబంపై రియా ఆరోపణలపై మరో కేసు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే, సుశాంత్ మరణంపై అనుమానాలకు ఎటువంటి ఆధారాలూ లేవని సీబీఐ అందులో పేర్కొన్నట్లు సమాచారం.ముంబయిలోని బాంద్రాలో 2020 జూన్ 14న సుశాంత్ సింగ్ తన ఫ్లాట్‌లో అనుమానాస్పద రీతిలో మరణించారు. సుశాంత్ ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బిహార్ పోలీసుల నుంచి ఆగస్టు 2020లో సీబీఐ చేతికి రాగా.. దాదాపు నాలుగేళ్లపాటు విచారణ కొనసాగింది.



## చేయనని చెప్పనుకానీ.. అలా అయితే చేస్తా..

'అర్జున్‌రెడ్డి' సినిమాలో కథానాయిక షాలినీ పాండే పోషించిన 'ప్రీతి' పాత్రను ఇష్టపడని ప్రేక్షకుడు ఉండడు. ఓ విధంగా ఆ సినిమా విజయంలో ఆ పాత్ర ప్రభావం చాలా ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర షాలినీకి రాలేదనే చెప్పాలి. అయితే.. రీసెంట్‌గా ఆమె 'డబ్బా కార్టెల్' వెబ్‌సిరీస్‌లో నటించారు. ఆ సిరీస్ ఓటీటీలో పెద్ద హిట్. అందులో బలమైన మహిళగా కనిపించి, ప్రశంసలందుకుంటున్నది షాలినీ పాండే. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మరోసారి 'అర్జున్‌రెడ్డి' లాంటి సినిమాలో ప్రీతి తరహా పాత్ర చేయాల్సివస్తే చేస్తారా?' అని ఓ విలేకరి అడగ్గా.. 'నేను కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో చేసిన సినిమా అది. ఇప్పుడు ఆ పాత్ర గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తుంది. ఆ పాత్రను ఇంకాస్త బలంగా రాయొచ్చేమో అనుకుంటున్నా. మరోసారి ఆ తరహా పాత్ర వస్తే చేయనని చెప్పను కానీ.. దర్శకుడితో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకొని అప్పుడు చేస్తా. అంతేకాదు, అప్పటికంటే ఇప్పుడు నటిగా పరిణితి చెందాను కాబట్టి ఇంకాస్త భిన్నంగా చేయడానికి ప్రయత్నిస్తా.' అంటూ చెప్పుకొచ్చింది షాలినీ పాండే.



## ఆ సినిమా హిట్ అయినా మేం ఆనందంగా లేము

ఆమిర్ ఖాన్ - రాజ్‌కుమార్ హిరాణి కాంబోలో వచ్చిన చిత్రం 'పీకే'. 2014లో విడుదలైన ఈ సినిమా బాలీవుడ్‌లో చరిత్ర సృష్టించింది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అయినప్పటికీ తాను ఆనందంగా లేనట్లు ఆమిర్ చెప్పారు. రాజ్ కుమార్ హిరాణి కూడా ఈ చిత్రం విజయాన్ని సెలబ్రేట్ చేసుకోలేదన్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ సినిమాను గుర్తుచేసుకున్నారు.

"ఆ సినిమా కథను దర్శకుడు రాజ్‌కుమార్ మరోలా రాసుకున్నారు. కానీ, చిత్రీకరణ జరిగే సమయంలో అది మొత్తం మార్చాల్సి వచ్చింది. తాను అనుకున్న కథ క్లైమాక్స్ మరో సినిమాను పోలి ఉండడంతో.. ఆ కథ తీస్తే కాపీ చేసినట్లు ఉంటుందనుకున్నాం. దీంతో ముగింపు మార్చేశాం. మొదట అనుకున్న క్లైమాక్స్‌ను తెరకెక్కించినట్లైతే ఇంకా బాగుండేది. అందుకే ఈ సినిమా విజయం సాధించినప్పటికీ మేం ఇద్దరం దీని విషయంలో ఆనందంగా లేము" అని చెప్పారు. ఇక సినిమా విడుదలయ్యాక 5 షోలు పూర్తయ్యేవరకూ దాని టాక్ విషయంలో అంచనాలకు రాలేమని ఆమిర్ అన్నారు. కథ బాగుంటే ప్రేక్షకులు ఎప్పుడూ సినిమాను ఆదరిస్తారని తెలిపారు. తాను నటించిన '3 ఇడియట్స్' సినిమాను కొందరు 7 సార్లు కూడా థియేటర్‌లోనే చూశారని చెప్పారు.



## ఐశ్వర్య ఫోన్ చేస్తే.. ఒత్తిడికి గురవుతా

### అభిషేక్ బచ్చన్

ముంబయి: బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ తాజాగా ఓ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల ఆయన నటించిన 'ఐ వాంట్ టు టాక్' చిత్రానికి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. తనకు ఈ అవకాశాన్ని ఇచ్చిన చిత్రబృందానికి అభిషేక్ ధన్యవాదాలు చెప్పారు. దర్శకుడి వల్లే తాను తండ్రి పాత్రలో ఒదిగిపోయానని తెలిపారు. అనంతరం ఆయన తన భార్య ఐశ్వర్యా రాయ్ గురించి పరోక్షంగా మాట్లాడారు. తోటి నటుడు, షో హోస్ట్ అర్జున్ కపూర్‌తో సరదాగా సంభాషించారు.

"ఉత్తమ నటుడిగా నేను అందుకున్న తొలి అవార్డు ఇదే. ఈ అవార్డుకు నేను అర్హుడినని భావించిన కార్యక్రమం నిర్వాహకులకు, న్యాయ నిర్ణేతలకు ధన్యవాదాలు. దర్శకుడు సూజిత్ సర్కార్ వల్లే నేను ఈ సినిమాలో అద్భుతంగా యాక్ట్ చేయగలిగా. ఆయనొక అద్భుతమైన చిత్రాన్ని రూపొందించారు. కాబట్టి.. ఈ పూర్తి క్రెడిట్ ఆయనకే దక్కుతుంది. సినిమాలో నాకు కుమార్తెలుగా నటించిన అహిల్య, పెరల్‌తో దీనిని పంచుకుంటా. తోటి నటీనటుల నుంచే ఎంతో స్ఫూర్తి పొందుతున్నా. ఆయా చిత్రాల్లో వారి నటన చూసి వారిలా నేను కూడా చేయాలని అనుకుంటూ ఉంటా. నన్ను నేను ఉత్తమంగా మార్చుకునేందుకు వారు ఎంతగానో తోడ్పడుతున్నారు" అని అభిషేక్ బచ్చన్ తెలిపారు.

## హీరోతో డేట్ చేయకూడదని షరతు పెట్టారు

'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్' చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో ఆమె పాల్గొన్నారు.ఒక సినిమాలో యాక్ట్ చేసినప్పుడు.. హీరోతో డేటింగ్ చేయకూడదని టీమ్ షరతు పెట్టిందని ఆమె తెలిపారు. ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించీ ఆమె మాట్లాడారు. "మున్నా మైకేల్'తో సినీ పరిశ్రమలో నా కెరీర్ మొదలైంది. ఇదొక బాలీవుడ్ చిత్రం. టైగర్ ష్రాఫ్ కథానాయకుడిగా నటించారు. ఈ సినిమాకు ఓకే చెప్పిన తర్వాత టీమ్ నాతో ఒక కాంట్రాక్ట్‌పై సంతకం చేయించుకుంది. సినిమాకు సంబంధించిన నేను పాటించాల్సిన విధి విధానాలు ఆ కాంట్రాక్ట్‌లో పొందుపరిచి ఉన్నాయి. అందులోనే నో డేటింగ్ అనే షరతు పెట్టారు. సినిమా పూర్తయ్యేవరకూ హీరోతో నేను డేట్ చేయకూడదని దాని సారాంశం. కాంట్రాక్ట్ మీద సంతకం చేసినప్పుడు నేను పెద్దగా ఇవన్నీ చదవలేదు. ఆ తర్వాతే నాక్కూడా ఈ విషయం తెలిసి ఆశ్చర్యపోయా. నటీనటులు ప్రేమలో పడితే వర్క్‌పై దృష్టిపెట్టరని ఆ టీమ్ భావించి ఉండొచ్చు. అందుకే ఇలాంటి షరతులు పెట్టి ఉంటుందనుకున్నా" అని నిధి అగర్వాల్ తెలిపారు.

అనంతరం ఆమె ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించి మాట్లాడుతూ.. "ఈ ప్రపంచంలో మంచి, చెడు రెండూ ఉన్నాయి. కేవలం మంచి మాత్రమే ఉందనడానికి వీల్లేదు. నేను మంచిదాన్ని కాబట్టి, అందరూ నాతో మంచిగానే ఉంటారు.. నా గురించి మంచిగానే మాట్లాడుకుంటారు అనుకుంటే కుదరదు. కొంతమంది మన గురించి చెడుగాను మాట్లాడుతుంటారు. మంచి లేదా చెడు ఏదైనా సరే చెప్పడానికి ఒక పద్ధతి ఉంటుంది. హద్దులు దాటి.. అసభ్యపదాలు ఉపయోగిస్తూ కామెంట్స్ చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదు. నేను చాలా స్ట్రాంగ్‌గా ఉంటా. ఇలాంటివాటిని పెద్దగా పట్టించుకోను. సోషల్‌మీడియా కామెంట్స్ నాపై పెద్దగా ప్రభావం చూపవు. కానీ, అందరూ నాలా ఉండరు. ఇలాంటి కామెంట్స్ చూసి వారు ఎంతో బాధపడతారు. ఈ విషయాన్ని గ్రహించి మర్యాదపూర్వకంగా కామెంట్స్ చేస్తే బాగుంటుంది" అని ఆమె అన్నారు.



## తెలుగు చిత్ర పరిశ్రమ దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ: మోహన్‌లాల్

మోహన్‌లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్' గతంలో విడుదలై సూపర్ హిట్ అయిన 'లూసిఫర్'కు సీక్వెల్‌గా రానుంది. మార్చి 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న నేపథ్యంలో తాజాగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. అందులో మోహన్‌లాల్, పృథ్వీరాజ్ దిల్‌రాజు పాల్గొన్నారు."తెలుగు చిత్ర పరిశ్రమ దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ. నటీనటులను తెలుగు ఆడియన్స్ గౌరవించే విధానం బాగుంటుంది. నా 47 ఏళ్ల కెరీర్‌లో ఎంతోమంది తెలుగు నటీనటులతో పనిచేసే అవకాశం లభించింది. నాగేశ్వరరావుతో నటించే అవకాశం రావడం నా అదృష్టం. కేరళలో మేం అన్ని భాషల సినిమాలు చూస్తాం. గతంలో నేను నటించిన మలయాళ సినిమాలు తెలుగులో రీమేక్ చేశారు. ఇప్పుడు డైరెక్ట్‌గా తెలుగులోనే విడుదల చేస్తున్నాం. ఇది సీక్వెల్ కాదు.. మేం ఈ సినిమా కథ అనుకున్నప్పుడే మూడు భాగాలు తీయాలని నిర్ణయించుకున్నాం. 'ఎల్2: ఎంపురాన్' కోసం రెండు సంవత్సరాలు కష్టపడ్డాం. ఈ సినిమా 50 రోజుల కార్యక్రమాన్ని మీ అందరితో కలిసి సెలబ్రేట్ చేసుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నా" అని మోహన్‌లాల్ ధీమా వ్యక్తంచేశారు."మన సినిమాలను రాజమౌళి, ప్రశాంత్ నీల్, సుకుమార్‌లు గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లారు. ఇప్పుడు ఆ వరసలో పృథ్వీరాజ్ సుకుమారన్ చేరారు. 'లూసిఫర్' మొదటి భాగం ఎంత హిట్ అయిందో తెలిసిందే. ఇప్పుడు పార్ట్ 2ను భారీగా తెరకెక్కించారు. దీని ట్రైలర్‌ను చూసి ఆశ్చర్యపోయాను. విజువల్స్ మరో స్థాయిలో ఉన్నాయి. మోహన్‌లాల్ స్క్రీన్‌పై కనిపించగానే వావ్ అనిపించింది. మంచి కథతో రూపొందిస్తే గ్లోబల్ ఆడియన్స్ కూడా మన సినిమాలు చూసేందుకు సిద్ధంగా ఉన్నారు" అని దిల్‌రాజు అన్నారు.

